PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 354 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 17 డిసెంబర్ 2025

## న్యాయవాదుల 5వ రాష్ట్ర సదస్సుకు తరలిరండి



3లో

## సింగరేణి సిఎండిగా కృష్ణ భాస్కర్



2లో

# హైదరాబాద్‌కు ఐఐఎంను ఇవ్వండి

- అవసరమైన 200 ఎకరాల భూమి ఇస్తాం
- ట్రాన్సిట్ క్యాంపస్‌లో వెంటనే తరగతులు ప్రారంభం
- ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు
- జిల్లాలకు అనుగుణంగా 9 కేంద్రీయ విద్యాలయాలు
- 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయండి
- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సిఎం రేవంత్ వినతి



**న్యూఢిల్లీ,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎంను మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాల్లో 1 కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎంలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. మిగతా2లో...



## నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌లకు ఊరట

**న్యూఢిల్లీ,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు తాత్కాలిక ఊరట లభించింది. ఈ కేసులో వారిరువురితో పాటు మరో ఐదుగురిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ కోర్టు మంగళవారం నిరాకరించింది. మిగతా2లో...

## పోలీసులకు చిక్కిన 17మంది మావోలు

- పట్టుబడ్డ వారిలో కీలక నేత చొక్కారావు?



2లో



2లో

## బిఆర్ఎస్ పార్టీ సమావేశం 21కి వాయిదా

- వెల్లడించిన పార్టీ నేత హరీష్ రావు

## మోడీతో భేటీ అంశాలు బయటకు ఎలా వచ్చాయి?

ఎవరు లీకు చేసి ఉంటారో తెలుసుకోవాలి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరా



**న్యూఢిల్లీ,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో బిజెపి నేతలు క్షేత్రస్థాయిలో సరిగా పనిచేయడం లేదని, పార్టీ బలోపతేంపై దృష్టి సారించడం లేదని ఇటీవల ప్రధాని మోడీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీతో ఇటీవల తెలంగాణ బీజేపీ నేతలు మిగతా2లో...

## దాడులపై మౌనం వహిస్తే ప్రతిదాడులు తప్పవు

గ్రామాల్లో కాంగ్రెస్ రౌడీయిజం చేస్తోంది

కామారెడ్డి జిల్లా బాధితులకు కెటిఆర్ పరామర్శ



**హైదరాబాద్,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదన్నారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకపోతే తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా సోమార్‌పేట్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స మిగతా2లో...

## నేడు మూడో విడత పంచాయితీ సమరం

- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నం కౌటింగ్...వెంటనే ఫలితాల ప్రకటన
- నేటితో పూర్తి కానున్న పంచాయితీ ఎన్నికల వ్యవహారం



2లో

## పరకామణి లెక్కింపు ఇంకా పాతపద్ధతేనా?

- ఆధునీకరణ దిశగా సాగాలి...ఎఐ వినియోగం చేపట్టండి
- ఎపి హైకోర్టు కీలక సూచనలు



**అమరావతి,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టీటీడీ పరకామణి లెక్కింపును ఆధునీకరించాలని రాష్ట్ర హైకోర్టు సూచించింది. ఆధునికకాలంలో కూడా పాతపద్దతిలో లెక్కింపు సరికాదని తెలిపింది. పరకామణి చోరీ కేసుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య వాదోపవాదనలు మిగతా2లో...



## మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు

మంత్రుల తొలగింపు వార్తలు అబద్ధం

చేరికలే తప్ప తొలగింపు ఉండదన్న పిసిసి చీఫ్

**న్యూఢిల్లీ,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో మంత్రిమండలి విస్తరణపై చాలా రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు త్వరలో తెరపడే అవకాశం ఉంది. జనవరిలో కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని మిగతా2లో...



## నరేగా పేరు మార్పుపై 17న కాంగ్రెస్ దేశవ్యాప్త ఆందోళన

**న్యూఢిల్లీ,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పునకు వ్యతిరేకంగా డిసెంబర్ 17న దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు హక్కుల ఆధారిత సంక్షేమాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని, దానిని కేంద్రం నుండి నియంత్రించే దాతృత్వ సంస్థతో భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. గాంధీజీ వారసత్వంపైన, కార్మికులు, వారి హక్కులైనా బిజెపి కుట్రపూరితంగా దాడి చేస్తోంది. మహాత్మాగాంధీ పేరును, ఆయన విలువలను తుడిచేయడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 17న జిల్లా ప్రధాన కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేసింది.

## కొత్త సర్పంచ్‌లు గ్రామాభివృద్ధిలో దూకాలి

- పారిశుధ్యం, విద్య, వైద్య సేవలపై దృష్టి సారించాలి
- రాజకీయాలకు అతీతంగా ముందుకు నడవాలి
- సర్పంచ్‌లకు సన్మాన సభలో డిప్యూటి సిఎం భట్టి

**ఖమ్మం,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్య సేవల మెరుగుదలపై సర్పంచులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి మిగతా2లో...



# హైదరాబాద్‌కు ఐఐఎంను ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి సీఎం వెల్లడించారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతులు కల్పనకు తాము సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటు చేస్తే అది తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల అవకాశాలను మెరుగుపర్చుతుందని సీఎం అన్నారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అవసరం ఉందని సీఎం అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మందాడి అనిల్ కుమార్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌తో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు సీఎం అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ కోరారు. యంగ్ ఇండియా స్కూళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను పంపాలని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి సూచించారు. దాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# కొత్త సర్పంచ్‌లు గ్రామాభివృద్ధిలో దూకాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిర నియోజకవర్గంలో ఇటీవల ఎన్నికైన సర్పంచులను భట్టి విక్రమార్క ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి ప్రపంచంతో పోటీపడే స్థాయిలో నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌లో 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శించినట్లు చెప్పారు. 2047 కల్లా రాష్ట్రంలో ఒక లక్ష 30 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 5 లక్షల 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలో మొత్తం 131 గ్రామపంచాయతీలకు గాను 90 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థులు గెలవడం చరిత్రలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు 20 వేల కోట్ల రూపాయలతో వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, రైతులకు 9 వేల కోట్ల రూపాయలతో రైతు భరోసా అందజేస్తున్నామని చెప్పారు.

# మోడీతో భేటీ అంశాలు బయటకు ఎలా వచ్చాయి?

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశం లో నేతలకు పలు కీలక అంశాలపై ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. అయితే ఈ భేటీలో ప్రస్తావించిన విషయాలు బయటకు వచ్చాయి. ఈ విషయంపై ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో తెలంగాణ బీజేపీ ఎంపీల సమావేశంపై వచ్చిన లీకులపై కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీతో చర్చించిన విషయాలు బయటకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎవరో కావాలనే ఈ విషయాలను లీకు చేశారని ్గ÷ర్ అయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను బయటకు చెప్పొద్దని మోదీ చెప్పారని గుర్తుచేశారు కిషన్‌రెడ్డి. కానీ మీటింగ్‌లో జరిగిన విషయాలను బయటకు ఎవరు ఎందుకు చెప్పారని మండిపడ్డారు. వారెవరో చెబితే వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాని మోదీ మీటింగ్‌లో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని మాత్రమే చెప్పారని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీని మరింతగా బలోపేతం చేయాలని మోదీ కోరారని అన్నారు. దక్షిణాది నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉపరాష్ట్రపతులు అయ్యారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సరికాదని అన్నారు. ఆయన అనైతికంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ స్థాయిని తగ్గించేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ విపక్ష నేతగా ఉండటం దురదృష్టకరమని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. ప్రస్తుతం మంత్రిమండలిలో మరో ఇద్దరు మంత్రులను తీసుకోవడానికి వీలుంది, అంటే రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న ఇద్దరు లేదా ముగ్గురిని తొలగిస్తారనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే, ఈ విషయంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ విస్తరణపై వస్తున్న ఊహాగానాలను మహేష్ గౌడ్ తోసిపుచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలను తప్పిస్తారనే ప్రచారం జరిగింది. దీనిపై మహేష్ గౌడ్ స్పందిస్తూ, ఆ ఇద్దరు మంత్రులు కేబినెట్‌లో కొనసాగుతారని స్పష్టత ఇచ్చారు. కేబినెట్‌లో తీసివేతలు ఉండవని, కేవలం చేరికలే ఉంటాయని ఆయన అన్న మాటలు కొందరికి ఊరట కలిగించాయి. కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చించిన తర్వాతే ఆయన ఈ ప్రకటన చేశారా లేదా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చలు జరిగాయా అనే చర్చ రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. కొంతమంది మంత్రులపై వివిధ రకాల ఆరోపణలు ఉన్నాయని, సొంత పార్టీ ఎమ్మెల్యేలు కూడా అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ, వారిని తొలగించే అవకాశం లేదని, అయితే శాఖల మార్పు మాత్రం ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ ఇండికేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. శాఖల మార్పులు చేసే విషయంలో కాంగ్రెస్ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుంది, అయితే ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డికి కూడా కొంత స్వేచ్ఛను ఇచ్చినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణలో ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయనేది ప్రధానంగా చర్చనీయాంశమైంది. ఈ పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటారా లేదంటే కేబినెట్‌లో ప్రాతినిధ్యం దక్కని జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. జనవరిలో జరగబోయే ఈ విస్తరణతో కేబినెట్ పూర్తిస్థాయిలో కొలువుదీరే అవకాశం ఉంది.

# దాడులపై మౌనం వహిస్తే ప్రతిదాడులు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

పొందుతున్న బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, అతని భార్య గంజి భారతిని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు ఇష్టమొచ్చినట్టు దాడులకు తెగబడుతుంటే.. పోలీసులు నిశ్చేష్టులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే తాము కూడా తిరగబడాల్సి వస్తుందన్నారు. ఇక దాడికి ప్రతిదాడే సమాధానం అనుకుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న అత్యంత దారుణంగా ఉందన్నారు. డీజీపీ స్థాయి నుంచి కిందిస్థాయి పోలీస్ అధికారుల వరకు అందరికీ గుర్తు చేస్తున్నా.. మీకు జీతాలు ఇస్తున్నది ప్రజల సొమ్ముతోనే. రేవంత్ ఇంట్లో సొమ్ముతోనే, కాంగ్రెస్ సొమ్ముతోనే కాదు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదని హెచ్చరించారు. భారతి, బాలరాజులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలన్నారు. ఆస్పత్రి పాలైన వారి కుటుంబాని ఆర్థిక సహాయం, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండేండ్లుగా బీఆర్ఎస్ కార్యకర్తకలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడు తున్నారని చెప్పారు. సూర్యాపేట, నల్లగొండలో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడి చేసి మూత్రం తాగించారన్నారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ కార్యకర్త మల్లయ్య యాదవ్‌ను కాంగ్రెస్ గూండాలు హత్య చేశారు, ఇంకో బీసీ సోదరుడి భార్య నామినేషన్ వేస్తే, అతడిని కిడ్నాప్ చేసి కోమటిరెడ్డి అనుచరులు చిత్ర హింసలు పెట్టారన్నారు. ఇన్ని అరాచకాలు జరిగినా పోలీసులు ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ గుర్తుపెట్టుకుంటున్నామని, పోలీసులు డ్యూటీ సరిగ్గా చేయకపోతే తామే డ్యూటీ చేస్తామన్నారు. దాడికి ప్రతిదాడి అనే పరిస్థితే వస్తే తాము కూడా తిరగబడతామన్నారు. కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్ర గాయాల పాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భారతి, బాలరాజ్ కుటుంబానికి, ఇతర కార్యకర్తలకు అయ్యే పూర్తి వైద్య ఖర్చులను పార్టీనే భరిస్తుందని చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని.. దాడికి తెగబడ్డ కాంగ్రెస్ గూండాలను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే డీజీపీ, ఎస్పీ కార్యాలయాల ముట్టడికైనా పిలుపునిస్తామన్నారు.

# సింగరేణి సిఎండిగా కృష్ణ భాస్కర్



**హైదరాబాద్,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్‌ను నియమించారు. ప్రస్తుతం టీజీ జెన్‌కో సీఎండీగా పనిచేస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక కార్యదర్శిగా కొనసాగుతున్న 2012 ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్ ను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సింగరేణి ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగించనున్నారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతున్న బలరాం పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో కృష్ణ భాస్కర్ ను నియమించారు. గతంలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన కృష్ణ భాస్కర్ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని జెన్కోలో చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌లకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

మనీలాండరింగ్ నిరోధక చట్టం లేదా పిఎంఎల్ఎ కింద ఇడి దాఖలు చేసిన ఫిర్యాదును ఎఫ్ఐఆర్ లేకుండా సమర్థించలేమని రోస్ అవెన్యూ కోర్టు పేర్కొంది. ఈ కేసులో ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, దీంతో ఇడి చార్జిషీటుపై ముందస్తుగా స్పందించలేమని తెలిపింది. నేషనల్ హెరాల్డ్ మాతృసంస్థ అయిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌ను మోసపూరితంగా స్వాధీనం చేసుకోవడానికి కుట్రపన్నారని ఆరోపిస్తూ సోనియా, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ విదేశీ విభాగం చీఫ్ శామ్ పిట్రోడా సహా ఐదుగురిపై ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యు) గత నెలలో నివేదికను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇడి అందించిన సమాచారం ఆధారంగా ఇఒడబ్ల్యు ఈ నివేదికను సమర్పించింది.

# పోలీసులకు చిక్కిన 17మంది మావోలు

● పట్టుబడ్డ వారిలో కీలక నేత చొక్కారావు?

**ఆదిలాబాద్,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేక మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. భారీ సంఖ్యలో మావోలు లొంగిపోయారు. ఇప్పుడు తాజాగా మావోయిస్టు కీలక నేత పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. మావోయిస్టు అధినేత చొక్కరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ )లో 15 మంది మావోయిస్టులు పోలీసులకు చిక్కారు. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు ఉండగా 7 పురుషులు ఉన్నట్టు సమాచారం. అలాగే వారిలో మావో అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారందనీ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి తరలిస్తున్నారు. మావోయిస్టులు పట్టుబడటంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# పరకామణి లెక్కింపు ఇంకా పాతపద్దతేనా?

(మొదటి పేజీ తరువాయి)

జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు పలు కీలక సూచనలు చేసింది. తిరుమల శ్రీవారి పరకామణిలో జరిగే చోరీలను సాధారణ దొంగతనంగా చూడటానికి వీల్లేదని స్పష్టం చేసింది. కానుకల రూపేణా వచ్చిన సొమ్ము చోరీకి గురయితే కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని హైకోర్టు తెలిపింది. పరకామణిలో కానుకల లెక్కింపు పక్రియను ఆధునీకీకరించాల్సిన అవసరముందని వెల్లడించింది. మానవ ప్రమేయాన్ని తగ్గించి.. యంత్రాలు, ఏఐ టెక్నాలజీని వినియోగించాలని తిరుమల తిరుపతి దేవస్థానానికి సూచించింది. టీటీడీలో ఇలాంటి చోరీ ఘటనలు జరుగుతున్నా కానుకలు లెక్కించేందుకు అదే పాత విధానాన్ని అనుసరించడం సరికాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. కానుకల లెక్కింపునకు సేవాభావంతో వచ్చిన భక్తులను దుస్తులు లేకుండా సోదాలు చేయడం, దొంగల్లా అవమానించడం తగదని పేర్కొంది. కానుకలు లెక్కింపునకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తగిన సూచనలు, సలహాలతో తమ ముందుకు రావాలని సూచించింది. ఈ క్రమంలోనే ఇరుపక్షాల న్యాయవాదులకు ఏపీ హైకోర్టు పలు సూచనలు చేసింది.

# బిఆర్ఎస్ పార్టీ సమావేశం 21కి వాయిదా

**హైదరాబాద్,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఈ నెల 19న జరగాల్సిన బీఆర్ఎస్ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం వాయిదా పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఐఅఖీ) ఆదేశాల మేరకు డిసెంబర్ 21న ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ సీనియర్ నేత హరీశ్ రావు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొనడం కోసం వాయిదా వేయడం జరిగింది. ఈనెల 21న కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్ వేదికగా నిర్వహించే బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గౌరవ పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు పాల్గొననున్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నది. గోదావరి, కృష్ణ జలాలను కొల్లగొడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దోపిడీని అడ్డుకోవడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రజల రైతాంగ సాగునీటి హకులను కాపాడుకోవడానికి మరో ప్రజా ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ భావిస్తున్నది. ఏపీ జలదోపిడీపై తెలంగాణ ప్రజా ఉద్యమాలు ఎలా చేపట్టాలనే అంశంపై పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి అధినేత కేసీఆర్ లోతుగా చర్చించనున్నారు.

# నేడు మూడో విడత పంచాయితీ సమరం

**హైదరాబాద్,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం 182 మండలాల్లోని 3,752 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. మూడో విడతలో మొత్తం 4,159 సర్పంచి స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 394 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 3,752 సర్పంచి స్థానాలకు 12,652 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 36,425 వార్డులకుగాను 7,908 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 28,410 వార్డులకు 75,725 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. 11 సర్పంచి స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. రెండు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిలిపివేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 1 గంటవరకు పోలింగ్ నిర్వహించి అనంతరం 2 నుంచి కౌంటింగ్ ప్రారంభిస్తారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరిగే గ్రామాల్లో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయి. ర్యాలీలకు అనుమతి లేదు. ఈ ఎన్నికతో ఇక పంచాయితీ ఎన్నికల తంతు పూర్తవుతుంది. మొత్తం గ్రామాల్లో కొత్త సర్పంచ్‌ల పాలన సాగనుంది.

# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయితీ ఎన్నికలు

● 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం

● పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి

**హైదరాబాద్,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటివరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం కొనసాగుతూనే ఉంది. గ్రామాలకు పూర్తి స్థాయి నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించాం అని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సహచర మంత్రుల నాయకత్వంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రామస్థాయిలో సత్తా చాటిందన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదు. రాళ్లు కాదు.. రాతి శిలలపై చెక్కిన చరిత్రే ఆదివాసీ అస్థిత్వానికి నిదర్శనం. ఇళ్ల విషయంలో భారత రాష్ట్ర సమితి నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నరలో కొన్ని వేల ఇళ్లు ఇచ్చిందని అన్నారు. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారింది. తాడ్వాయి ప్రాంతంలో ఆదివాసీ మహిళ గెలిస్తే భూములు లాగేసుకుంటారని ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం నీచమైన రాజకీయం. మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# న్యాయవాదుల 5వ రాష్ట్ర సదస్సుకు తరలిరండి



**హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ**

**హనుమకొండ జిల్లా,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్)** : సామాజికన్యాయం, న్యాయవాద హక్కులు, రక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ ఎల్ పి ఎ) 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయడం కోసం హనుమకొండ జిల్లా న్యాయవాదులు పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ నెల 20 న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగు ఐ ఎల్ పి ఎ 5వ రాష్ట్ర సదస్సు గోడ పత్రికలను మంగళవారం హనుమకొండ జిల్లా కోర్టు ఆవరణలో విడుదల చేసి వారు మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు రక్షణ చట్టాలున్నాయని ప్రజల హక్కుల కోసం నిరంతరం వాదించే న్యాయవాదులకు రక్షణ చట్టం లేకపోవడం శోచనీయమని, 80 ఏండ్ల స్వాతంత్ర భారత దేశంలో ఇంకా అసమానతల సమాజం కొనసాగడం శోచనీయమని ఆయన అన్నారు. సమాజంలో అత్యున్నత విద్యతో పాటు రాజ్యాంగాన్ని అధ్యయనం చేసిన ఉన్నత విద్యావంతులైన న్యాయవాదులు చైతన్యం చెందడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని ఆయన అన్నారు. మహిళా సమానత్వం, ఆయా వర్గాలకు సమ న్యాయం జరగాలని న్యాయవాదులతో పాటు ప్రజలను చైతన్యం చేస్తున్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిని నరేందర్ మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ సిద్ధాంత పునాదితో పని చేస్తున్న ఐ ఎల్ పి ఎ మెజార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని, సామాజిక న్యాయం కోసం కోర్టుల్లో వాదించే న్యాయ శాఖలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకపోవడం వల్ల న్యాయశాఖలో అత్యున్నత స్థాయికి ఎదగడానికి అణగారిన వర్గాలకు అవకాశం లేకుండా పోయిందని అన్నారు. న్యాయవాదుల వృత్తిపరమైన అభివృద్ధితో పాటు సామాజిక చైతన్యం కల్పించడం ద్వారనే బహుజన సమాజాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయవచ్చని అన్నారు. సామాజిక న్యాయం కోసం ఐ ఎల్ పి ఎ చేస్తున్న పోరాటంలో న్యాయవాదులు కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20 న కొత్తగూడెంలో జరుగు రాష్ట్ర సదస్సులో రాజ్యాంగ విలువలు – ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ప్రజల హక్కులు, ఇ డబ్ల్యు ఎస్ కు లేని నిబంధన ఓబీసీ లకు ఎందుకు, మహిళా కోటాలో బహుజన కోటా, న్యాయవాద రక్షణ చట్టం అనే నాలుగు అంశాలపై జరుగు సదస్సుకు ముఖ్య అతిథులుగా మాజీ హై కోర్టు జడ్జి, మాజీ జాతీయ ఓబీసీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, విశిష్ట అతిథులుగా కొత్తగూడెం జిల్లా జడ్జి పాటిల్ వసంత్, అదనపు జిల్లా జడ్జి ఎస్ సరిత, గౌరవ అతిథులుగా రిటైర్డ్ ఐ ఎ ఎస్ అధికారి టి చిరంజీవులు, కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, ఐ ఎల్ పి ఎ జాతీయ అధ్యక్షులు సుజాత కె చౌదంటే, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత,కర్ణాటక సీనియర్ న్యాయవాది ఎస్ బాలన్, సుభాస్ చంద్ర బోస్, డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు హారవుతారని తెలిపారు. ఇట్టి సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుండి న్యాయవాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ రాష్ట్ర నాయకులు చిల్ల రాజేంద్రప్రసాద్, మల్లెల భాస్కర్, హనుమకొండ జిల్లా కన్వీనర్ ముచ్చు రాజేందర్, హనుమకొండ బార్ కన్వీనర్ పూసపెల్లి శ్రీనివాస్, న్యాయవాదులు సిరబోయిన శ్రీనివాస్, చింత సాంబశివరావు, సూరం నరసింహ, అంబేద్కర్, కవిత, చింత నిఖిల్, శివకుమార్ యాదవ్, ఎగ్గడి సుందర్ రామ్, రమేష్, పూస రవీందర్, రామకృష్ణ, గంధం శివ, అనిల్, రాచకొండ ప్రవీణ్ కుమార్, అక్రమ్, కొంగర సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాంసెఫ్ జాతీయ మహా సభలను జయప్రదం చేయండి

**బాంసెఫ్ జాతీయ ప్రచారకులు చెన్నయ్య**



**హనుమకొండ జిల్లా,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్)** : బహుజన సమాజ సంఘ పరివర్తన, సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికారం పోరాటం చేస్తున్న బాంసెఫ్, రాష్ట్రీయ మూల నివాసి సంఘ్ ల 42 వ జాతీయ మహా సభలకు బహుజన సమాజం పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని బాంసెఫ్ జాతీయ ప్రచారకులు పిలుపు నిచ్చారు. ఒడిస్సా రాష్ట్రం కటక్ నగరం, బారబతి స్టేడియం వద్ద ఈ నెల 26, 27 రెండు రోజుల పాటు జరుగు 42వ జాతీయ మహాసభల కరపత్రాలను మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో ఆవిష్కరించి మాట్లాడారు. వెనుకబడిన తరగతుల కులాల జనగణనతో పాటు దేశంలో మెజార్టీ సమాజమైన బహుజన సమాజం ఎదుర్కుంటున్న పలు సమస్యలపై జాతీయ మహాసభలో చర్చ జరుగుతుందని ఆయన అన్నారు. ఒక్కటిగా కలిసి నడిచే బహుజన సమాజాన్ని చీల్చే కుట్రలపై, జనాభా దామాషాపై రిజర్వేషన్లు కల్పించడం, సంచార జాతులను గుర్తించాలని, ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ పరం చేసి బహుజన వర్గాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కొల్లగొట్టడం లాంటి పలు సామాజిక అంశాలపై చర్చించి బహుజన సమాజాన్ని స్వతంత్ర రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడమే బాంసెఫ్ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్య క్రమంలో భారతీయ విద్యార్థి మోర్చా జాతీయ నాయకుడు బట్టు శ్రీదర్ ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల భాస్కర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిని నరేందర్, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లయ్య, జిల్లా నాయకులు రవీందర్, బిఎంఎం నాయకులు మణితేజ, న్యాయవాదులు చిల్ల రాజేంద్రప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ శ్రీనివాస వర్మ జన్మదిన వేడుకలు

**శ్రీనివాస్‌కు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు శ్రేయోభిలాషులు**





**హనుమకొండ జిల్లా,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్)** :వరంగల్ ములుగు రోడ్ లో గల వర్మ చెస్ట్ హాస్పిటల్లో ప్రముఖ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాస వర్మ జన్మదిన వేడుకలు మిత్రులు శ్రేయోభిలాషల మధ్య సోమవారం నాడు అత్యంత ఘనంగా జరిగాయి. డాక్టర్ శ్రీనివాస వర్మ జన్మదిన వేడుకలకు ఆయన మిత్రులు, సన్నిహితులు, ప్రముఖ డాక్టర్లు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన చిన్ననాటి మిత్రులు మాట్లాడుతూ మా ప్రియ మిత్రుడు ఐన డాక్టర్ శ్రీనివాస వర్మ డాక్టర్ వృత్తినే దైవంగా భావిస్తూ, ఇంతింతై వటుడింతయిన చందంగా, ఎంత ఎదిగిన, ఒదిగి ఉండే మనస్తత్వం కలిగిన మా వర్మ ఎందరికో, తనకు తోచిన విధంగా వర్మ హాస్పిటల్ లో నిరుపేదలకు, బడుగు బలహీన వర్గాలు ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తూ, ధనార్జన అనే లాభం లేకుండా, పేద ప్రజల పట్ల సాత్వికతత్వం గల వ్యక్తిగా అభిమానాన్ని, ప్రేమను పంచుతూ, తన హాస్పిటల్ కి వచ్చే రోగుల పట్ల బాధ్యతతో కూడిన చికిత్సను అందిస్తూ, సందేహాలను తీరుస్తూ, రోగం పట్ల వారికి ఉన్న భయాన్ని తన ప్రేమ పూర్వ కమైనటువంటి మాటలతో, వారి బ్రతుకులకు బాధ్యతతో కూడిన సలహాలను, సూచనలను ఇస్తూ, రోగులకు బాధలను మైమరిపించే విధంగా వారితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ రోగానికి అవసరమైన తన అమూల్యమైన మాటలనే మందులు గా మారుస్తూ, ఎంత కఠినమైన వ్యాధి గ్రసులను కూడా సామాన్య మానవులుగా తీర్చి దిద్దుతూ, ఫీజులలో రాయితీలు కల్పిస్తూ,అవసరమైన మేరకే మందులను ఇస్తూ డాక్టర్ వృత్తిపై తనకున్న అపారమైన నమ్మకాన్ని పేద ప్రజలకు పంచుతూ, మా మధ్యలో జన్మదిన శుభాకాంక్షలు జరుపుకోవడం మాకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన మిత్రులు ఈ సందర్భంగా అన్నారు. జన్మదినం సందర్భంగా ఎంజీఎం దావఖానలో అన్నదానం మరియు పండ్ల పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీనివాస వర్మ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ లోనే అతిపెద్ద హాస్పిటల్ అయినటువంటి ఎంజీఎం లో, హాస్పిటల్ దగ్గర ఉన్నటువంటి రోగులకు మరియు రోగుల బంధువులకు డాక్టర్ శ్రీనివాస "వర్మ ఫౌండేషన్" ద్వారా ఆహారము మరియు పండ్ల పంపిణీ చేయడం జరిగింది. దాదాపుగా 500 మంది రోగులకు వారి బంధువులకు ఆహార పొట్లాలు మరియు వివిధ రకాల పండ్లను అందిస్తూ పేద ప్రజలపై తనకు ఉన్నటువంటి ఔచ్చికతను డాక్టర్ శ్రీనివాస వర్మ చాటుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ నా పుట్టినరోజు కావడం నా అదృష్టంగా భావిస్తూ, చిన్నప్పటినుండి నేను పెరిగి పెద్దయినటువంటి, నా బాల్య జీవితంలో, నేనూ ఎదిగిన క్రమంలో ఎన్నో సందర్భాలలో చాలా కష్టాలను అనుభవించానని, కష్టపడి చదువుకొని ఈరోజు వైద్య వృత్తిలో కొనసాగుతున్నానని, ఈ క్రమంలో సమాజానికి, సమాజంలో ఉన్నటువంటి పేద మధ్య తరగతి ప్రజలకు నాకు తోచిన విధంగా సమాజం నాకు ఏమిచ్చింది అని కాకుండా, సమాజానికి నేనూ ఏం చేస్తున్నాను అనే ఒక పెద్ద బాధ్యత అయినటువంటి ఆ మాట నా మనసులో నేను చిన్నప్పుడు పడ్డ నా కష్టాలను గుర్తుకు తెచ్చుకుంటూ, సమాజానికి ఏదో ఒకటి చేయాలి అనే ఒక మంచి ఉద్దేశంతో వర్మ ఫౌండేషన్ అనే సంస్థను నెలకొల్పి పేద ప్రజలకు ఉచితంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వారి అవసరాలకు తగ్గట్టుగా వారి సమస్యలకు వారి రోగాలకు తగ్గట్టుగా మందులు కానీ ఆర్థిక సహాయాలు గాని లేక సేవా కార్యక్రమాలు గాని ఇలాంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలనీ అనిపించి, నేను అనుకున్న విధంగా కాకపోయినా ఎంతో కొంత చేస్తున్నానని, ఆ సంతోషం నాకు ఈరోజు ఎంతో సంతృప్తిని ఇస్తున్నాయని, ఇకముందు కూడా భవిష్యత్తులో మరెన్నో పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు వర్మ ఫౌండేషన్ ద్వారా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన చిన్ననాటి మిత్రులు శ్రేయోభిలాషులు హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖను కలిసిన అచ్చ వినోద్ కుమార్



**వరంగల్, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్)** : ఖిలా వరంగల్ రాతికోట మోట్ కార్యక్రమానికి శంకుస్థాపన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ చేశారు. అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖను వరంగల్ జిల్లా పెరుక అధ్యక్షులు అచ్చ వినోద్ కుమార్ కలిసి అభినందనలు తెలిపారు. నగరంలోని శంభుని గుడిలో ఉన్న దేవత మూర్తుల విగ్రహాలు అస్తవ్యస్తంగా ఉన్న నంది విగ్రహాన్ని పంచముఖ శివ లింగాన్ని శాస్త్రీయంగా వేద పండితులచే పుణ ప్రతిష్ట చేయాలని మంత్రివర్యులు కొండా సురేఖ దృష్టికి భక్తుల ఆధ్వర్యంలో వినతి సమర్పించడం జరిగిందని వరంగల్ జిల్లా పెరుక అధ్యక్షులు అచ్చ వినోద్ కుమార్ తెలిపారు.

# నూతన సర్పంచిగా ఎన్నికైన జంపాల ప్రభాకర్‌ని సన్మానించిన మంత్రి సీతక్క



**ములుగు జిల్లా, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్)** : ములుగు జిల్లా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మచ్చపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి జంపాల ప్రభాకర్ నూతన సర్పంచిగా ఎన్నికైన శుభ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి సీతక్క మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దాసరి సుధాకర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కణతల నాగేందర్ రావు జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్ యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెం శ్రీకాంత్ గ్రామ అధ్యక్షులు వేల్పుగొండ ప్రకాష్ గోవిందరావుపేట సర్పంచ్ లావుడ్య జోగ నాయక్ మరియు తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 18 నుంచి 22 వరకు రేషన్ షాపులలో బియ్యం లభ్యం

**రేషన్ షాపులలో బియ్యం లభ్యతపై పత్రిక ప్రకటన విడుదల చేసిన అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్)** : డిసెంబర్ 18 నుంచి 22 వరకు రేషన్ షాపులలో బియ్యం లభ్యత ఉంటుందని, లబ్ధిదారులు బియ్యం పొందాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టబిలిటీ బియ్యం సంబంధించి ఖమ్మం జిల్లాకు 446.282 మెట్రిక్ టన్నులు కేటాయించడం జరిగిందని, ఈ బియ్యాన్ని చౌక ధరల దుకాణాలకు సరఫరా చేసామని, రేషన్ లబ్ధిదారులు డిసెంబర్ 18 నుంచి డిసెంబర్ 22 వరకు వారికి సమీపంలో గల చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) నుంచి పోర్టబులిటి ద్వారా బియ్యం పొందాలని అన్నారు. ఇట్టి విషయంలో లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సుడా చైర్మన్‌ను కలిసిన నూతనంగా ఎన్నికైన సర్పంచులు...

**- సుడా కార్యాలయానికి వచ్చిన సర్పంచులను శాలువాలతో సన్మానించి మిఠాయి తినిపించిన సుడా చైర్మన్.**

**- గ్రామాల సమస్యలు,అభివృద్ధి పై సుడా చైర్మన్ తో చర్చలు.**

**- కలిసి నడుద్దాం మంత్రుల సహకారంతో మరియు సుడా నిధులతో అభివృద్ధి పనులు చేపడుదామన్న కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి...**



**కరీంనగర్,డిసెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):**నూతనంగా ఎన్నికైన సర్పంచులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని సుడా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సుడా కార్యాలయానికి వచ్చిన సర్పంచులను నరేందర్ రెడ్డి శాలువాలతో సత్కరించి మిఠాయి తినిపించారు.ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాల సమస్యలు అభివృద్ధిపై నరేందర్ రెడ్డితో చర్చించారు.జిల్లా మంత్రుల సహకారంతో మరియు సుడా నిధులతో అభివృద్ధి పనులు చేపడుదామని ఏసమస్య వచ్చినా నేను అందుబాటులో ఉంటానని ఎప్పుడైనా మా వద్దకు రావచ్చని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని నరేందర్ రెడ్డి సూచించారు.సుడా చైర్మన్ ను కలిసిన వారిలో చామనపల్లి సర్పంచ్ బోగొండ ఐలయ్య,దుబ్బపల్లి సర్పంచ్ మోతె ప్రశాంత్ రెడ్డి,ఎలబోతారం సర్పంచ్ తప్పట్ల రాజు,జూబ్లీ నగర్ సర్పంచ్ కమలాకర్,ఫకీర్ పేట్ సర్పంచ్ బొద్దుల విజయలక్ష్మి లక్ష్మీనారాయణ,బహదూరా?న్ పేట్ సర్పంచ్ గుర్రం సంధ్య తిరుపతి రెడ్డి, దుబ్బపల్లి ఉప సర్పంచ్ అల్వాల శ్రీకాంత్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి,వేల్పుల రవీందర్ రావు,మీసాల సాయిలు,బుర్ర గంగయ్య,దీకొండ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో పీఎంజీఎస్వై ద్వారా 1,023 కి. మీ. రోడ్లు

**రహదారుల సమస్యలపై పార్లమెంట్‌లో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చిన కేంద్రమంత్రి**

**నిర్మాణ నాణ్యత పర్యవేక్షణ, నిధుల వివరాలను కోరిన రామసహాయం**

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలోని వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ( పిఎంజీఎస్ వై ), ఆర్సిపిఎల్ డబ్ల్యూఈఏ ఆధ్వర్యంలో 1,023 కి. మీ. రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ వెల్లడించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా మంగళవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తెలంగాణలోని వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల అనుసంధానంపై లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ..తెలంగాణతో



పాటు దేశవ్యాప్తంగా రహదారి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.**తెలంగాణలో 146 రహదారి పనులు, 112 వంతెనల నిర్మాణం** ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈఏ కింద తెలంగాణకు 146 రహదారి పనులు, 112 వంతెనలు మంజూరు చేసినట్లు కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు. మొత్తం 1,023కిలోమీటర్లు కాగా... రూ.681.15 కోట్ల వ్యయంతో ఇప్పటివరకు 39 రహదారి పనులు (478 కి.మీ.), 50 వంతెనల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. మిగిలిన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, 2026 మార్చి నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.**నాణ్యత-నిధులపై కేంద్ర పర్యవేక్షణ** పిఎంజిఎస్ వై కింద చేపడుతున్న రహదారి పనుల నాణ్యతపై మూడు స్థాయిల పర్యవేక్షణ వ్యవస్థ అమల్లో ఉందని కేంద్రం వివరించింది. ఎన్‌ఆర్‌ఐడీఏ సాంకేతిక పరిశీలన, జాతీయ-రాష్ట్ర స్థాయి నాణ్యత తనిఖీలు, సీఏజీ ఆడిట్‌ల ద్వారా నిర్మాణ నాణ్యతను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నిధుల సకాల విడుదల కోసం రాష్ట్రాలతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.**జాతీయస్థాయిలో ఇలా..** 2016లో ప్రారంభించిన ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈఏ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని 44 వామపక్ష ప్రభావిత జిల్లాల్లో రహదారి అనుసంధాన పనులు కొనసాగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 12,212 కి.మీ. రహదారులు, 701 వంతెనలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఇందులో 9,764 కి.మీ. రహదారులు, 528 వంతెనలు పూర్తయ్యాయని, మొత్తం వ్యయం రూ.9,339.74 కోట్లు అని వివరించారు.

## పోలింగ్ సామాగ్రిని పంపిణీ కేంద్రాలను సందర్శించిన సీపీ



**హన్మకొండ, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మూడవ విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం దామెర, ఆత్మకూర్, శాయంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ పత్రాల పంపిణీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను సమీక్షించారు. బ్యాలెట్ పత్రాలను తరలించేటప్పుడు మూడవ విడత ఎన్నికల వేళ ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్, ఎన్నికల సిబ్బందికి సీపీ కీలక సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట అదనపు డిసిపి బాల స్వామి, ఏ. ఎస్పీ శుభం, ఏసీపీ లు సతీష్ బాబు, సత్యనారాయణ తో పాటు స్థానిక ఎస్. ఐలు, ఇన్స్ స్పెక్టర్లు, ఎస్. ఐలు పాల్గొన్నారు.

## శనివారం అంగడిలో ట్రాఫిక్ జామ్ - రోడ్డుపై కూరగాయల అమ్మకాలే కారణం





**కరీంనగర్ టౌన్ డిసెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని శనివారం అంగడిలో రోడ్డుపైనే కూరగాయలు విక్రయించడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ప్రధాన రహదారి ఇరుకుగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో పాటు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రోడ్డుపైనే నిలిపివేయడం సమస్యను మరింత పెంచుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సేవల వాహనాలు కూడా ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని వారు తెలిపారు. పోలీస్ అధికారులు అప్పుడప్పుడు ట్రాఫిక్ నియంత్రణ చేపడుతున్నప్పటికీ, శాశ్వత పరిష్కారం కావాలని ప్రజలు కోరుతున్నారు.రోడ్డుపై కాకుండా ప్రత్యేక స్థలంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే ఈ సమస్య తీరుతుందని స్థానికులు సూచిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం: డీసీపీఓ దుర్దన పర్వీన్

**కరీంనగర్ టౌన్ డిసెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీఓ) దుర్దన పర్వీన్ తెలిపారు. కరీంనగర్ ఖర?నగడ్డ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బాల్య వివాహాల ముక్తి భారత్ కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. చట్ట ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల చట్టపరమైన సమస్యలతో పాటు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినట్లయితే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని ఆమె కోరారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.



# సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది**

**- నగరంలో ఏదైనా ఒక మార్గానికి సమద్ నవాబ్ మార్గుగా నామకరణం చేయాలని తీర్మానం**

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**కరీంనగర్,డిసెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):**సీనియర్ కాంగ్రెస్ నాయకులు సమద్ నవాబ్ గారి సంతాప సభ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి తాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో జరిగినది. ఇట్టి కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గారు, మాజీ శాసనసభ్యులు ఆరెపల్లి మోహన్ గారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. సమద్ నవాబ్ గారి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, అందరిని కలుపుకొని పోయే వ్యక్తి నవాబుగారు అని, కాంగ్రెస్ పార్టీతో సమద్ నవాబుకు విడదీయలేని బంధం ఉందని, ఆయన మరణించినాడు అంటే ఇప్పటికీ నమ్మలేక పోతున్నామని, నవాబు గురించి ఎంత చెప్పినా తక్కువనే అవుతుందని, వారి కుటుంబానికి



కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, పార్టీలో వారి కుటుంబంలో ఒకరికి సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ కోసం, పేద ప్రజల కోసం వారి అభ్యున్నతి కోసం తపించేవారని, నవాబ్ చనిపోతే సొంత కుటుంబంలో వ్యక్తిని కోల్పోయినంత బాధగా ఉందని, ఏ సమస్య వచ్చిన తన ఇంటి సమస్యగా భావించి పరిష్కారం కోసం కృషి చేసేవాడని,వక్ బోర్డు ఆస్తుల కోసం పోరాడిన వ్యక్తి సమద్ నవాబు గారని, నగరంలో ఏదో ఒక మార్గుకు సమద్ నవాబ్ మార్గుగా నామకరణం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో



నాయకులు ముదుపు మోహన్, కంరుద్దిన్, కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రావణ్ నాయక్, వెన్న రాజ మల్లయ్య, కామ్ రెడ్డి రామ్ రెడ్డి,పంజాల స్వామి గౌడ్,వెన్నం రజిత రెడ్డి, అహమ్మద్ అలీ, అబ్దుల్ రహమాన్,ముస్తాక్,అమీర్, బొమ్మ ఈశ్వర్ గౌడ్,మహమ్మద్, నిహాల్,లాయిక్,షబానా మహమ్మద్, ఇర్ఫాన్,బషీరుద్దీన్, మిరాజ్ డాన్, అబ్దుల్ భారీ, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, సిరిపురం నాగ ప్రసాద్, వసీం,అక్బర్,ఆరిఫ్,గౌస్,పాషా విక్టర్,సోహెల్, పాషా, జమీల్, సర్వర్,కలీం,సలీం లతోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మానవసేవయే మాధవసేవ

**- టిడబ్ల్యూజేఎఫ్ (H-2843)**

**- సకాలంలో చికిత్స అందింపజేసి ప్రాణాలు కాపాడిన నేతలు**

**- టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు చక్రవర్తి, ఫెడరేషన్ బృందానికి పలువురి ప్రశంశలు**

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు గుర్తించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ల ఫెడరేషన్ నేతలు యూనియన్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తికి సమాచారం అందించగా... ఆసుపత్రి వైద్య ఉన్నత అధికారులు స్పందించే విధంగా చర్యలు చేపట్టి మెరుగైన చికిత్సను అందింపజేసి ఆ గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాలను కాపాడిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కు సర్వత్ర ప్రశంసల వెల్లువ వెల్లువెత్తింది.వివరాల్లోకి వెళితే... ఖమ్మం గవర్నమెంట్ హాస్పిటల్‌లోని వినాయకుడి గుడివద్ద, గుర్తు తెలియని ఓ వ్యక్తి అస్వస్థతకు గురై, పెరాలసిస్ లక్షణాలతో క్షీణించిన స్థితిలో కనిపించాడు. అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్లు ఈ పరిస్థితిని గమనించి, అతని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా, వణుకుతున్న గొంతుతో మాట్లాడలేని పరిస్థితిలో ఉండటంతో పూర్తి సమాచారం ఇవ్వలేక పోయాడు. అతడు ఆకలితో ఉన్నాడని గుర్తించిన ఆటో డ్రైవర్లు వెంటనే భోజనం పార్సల్ తెప్పించి మానవీయతతో అతనికి ఆహారం అందించారు. ఈ విషయాన్ని అంబులెన్స్ డ్రైవర్ ఎర్ర గంగాధర్‌కు తెలియజేయగా, ఆయన టి.డబ్ల్యూ.జే.ఎఫ్ కార్యవర్గ సభ్యుడు, టీజీ%-%24 ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ శ్రీధర్ ద్వారా జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించి, జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్‌ను జిల్లా అద్యక్షులు చక్రవర్తి, యూనియన్ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్ లు ఫోన్‌లో సంప్రదించి, పరిస్థితిని వివరించారు. వారి సూచన మేరకు గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ నరేందర్‌ను సంప్రదించగా, ఆయన తక్షణమే స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. తక్షణమే స్పందించిన ప్రభుత్వ వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ఆ గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాపాయస్థితి నుంచి కోలుకున్నాడు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్య అధికారులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి ఆరోగ్యాన్ని కాపాడిన వారిలో పరోక్ష సహాయ సహకారాలు అందించిన ఆటో డ్రైవర్ల, అంబులెన్స్ డ్రైవర్ గంగాధర్‌లకు టి.డబ్ల్యూ.జే.ఎఫ్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమయోచిత స్పందన పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# జె.యం.జె. కళాశాలలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**హన్మకొండ, డిసెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):**ధర్మసాగర్ మండలం కరుణాపురం లోని జె. యం. జె. కళాశాల కరస్పాండెంట్ జాని వియాని, ప్రిన్సిపల్ జోజమ్మ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యా జ్యోతి డిగ్రీ, పీజీ కళాశాల, ఫాదర్ కొలంబో సిబిఎస్సి పాఠశాల ప్రిన్సిపల్ థామస్ కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫాదర్ థామస్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్ అంటే ఏసు క్రీస్తు జన్మదినాన్ని గుర్తు చేస్తుందని ఈ పండుగ ప్రపంచమంతా కొనియాడుతోందని అన్నారు. మరియు కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ అందరూ ప్రేమ, శాంతి సమాధానంతో ఉండి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా బాగా చదువుకోవాలన్నారు. ఈ సెమీ క్రిస్మస్ వేడుకల్లో కళాశాల విద్యార్థులు చేసిన సంస్కృత కార్యక్రమాలు, పాటలు, డాన్సులు, నాటకాలు అందరినీ అలరించాయి. ఈ కార్య క్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, చిన్నారులు, పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లాలో పరిశ్రమల విస్తరణకు వేగవంతమైన చర్యలు

**రఘునాథపాలెం మండలం పరిధిలో టిజిఐఐసికి కేటాయించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం రఘునాథపాలెం మండలం జింకల తండా, పువ్వాడ నగర్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌళిక వసతుల అభివృద్ధి సంస్థ (టిజిఐఐసి) కు కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పరిశ్రమలు నెలకొల్పడానికి స్థలం అనుకూలమైన పరిస్థితులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. కేటాయించిన భూమి యొక్క విస్తీర్ణం, సరిహద్దులు, రహదారి అనుసంధానం, మౌళిక సదుపాయాల లభ్యతను సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ప్రస్తుతం ఉన్న మొత్తం స్థలంను సేత్వార్, కాస్రా, నక్షా మ్యాప్ లను ఆధారంగా సమగ్రంగా సర్వే చేసి సరిహద్దులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాను పరిశ్రమలకు అనుకూల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తున్నదని, టిజిఐఐసి ద్వారా కేటాయించిన భూములను సమర్థవంతంగా వినియోగించి ఆర్థిక అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మైనింగ్ ఏడీ సాయినాథ్, పరిశ్రమల శాఖ జీఎం సీతారాం నాయక్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలి

**● అడిషనల్ డీసీపీ లా అండ్ అర్డర్ ప్రసాద్ రావు**





**కల్లూరు, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పక్రియ ముగిసే వరకు పోలీస్ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీసీపీ లా అండ్ అర్డర్ ప్రసాద్ రావు అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కల్లూరు, తల్లాడ మండలాల ఎన్నికల సందర్భంగా పోలీస్ బందోబస్తు సిబ్బంది యొక్క విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయడానికి పోలీస్ సిబ్బంది సమయస్పూర్తితో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల విధులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, నిబంధనలను ఉల్లంఘించినా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. విధినిర్వహణలో సిబ్బందికి ఏదైనా ఇబ్బందులు, ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం అందించాలని, వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావలిని ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికల విధులలో ఎలాంటి అలసత్వం లేకుండా క్రమశిక్షణతో తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

**20న మహాసభల విజయవంతానికి యూనియన్ నేతల పిలుపు**




**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా మూడో మహాసభల పోస్టర్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు కలెక్టర్ ను మహాసభలకు ఆహ్వానించారు. కలెక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. ఈనెల 20న ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించే ఖమ్మం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అడ్ హక్ కమిటీ సభ్యులు సయ్యద్ ఖదీర్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 9 గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నికరంగా పోరాడేది టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ ఉపాధ్యక్షుడు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు దువ్వా సాగర్, కూరాకుల గోపి, ఆవుల శ్రీనివాస్, కొత్త యాకేష్, మానుకొండ రవి కిరణ్, పత్తి శ్రీను, మధుశ్రీ, గణేష్, అర్షద్ తదితరులు ఉన్నారు.

# నేషనల్ హైవే నిర్మాణపనుల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

**అభివృద్ధి పనుల భూ సేకరణ అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలి**

**జిల్లాలో పురోగతిలో ఉన్న జాతీయ రహదారుల భూ సేకరణ స్థితిగతులు, నిర్మాణ పనులుపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా పూర్తవడానికి మిగులు భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో భూసేకరణ ప్రక్రియ, నేషనల్ హైవే నిర్మాణ పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కురవి సెక్షన్, నాగపూర్-అమరావతి జాతీయ రహదారుల నిర్మాణం నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మిగులు భూముల భూసేకరణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. మేజర్ బ్రిడ్జిలు, వియుపి లు, ఆర్ఓబి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాగపూర్-అమరావతి ప్యాకేజి-1 మరియు 2 భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పరిహార చెల్లింపులు పూర్తిచేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలని అన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, ఎన్.హెచ్.ఏ.ఐ పిడి రామాంజనేయరెడ్డి, ఇఇ యుగంధర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూడో విడత ఎన్నికలకు పోలీస్ సిద్ధంగా ఉండాలి







**సత్తుపల్లి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. ఖమ్మంపోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సత్తుపల్లి, సత్తుపల్లి రూరల్ మండలం ఎన్నికల సందర్భంగా పోలీస్ బందోబస్తు సిబ్బంది యొక్క విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయడానికి పోలీస్ సిబ్బంది సమయస్పూర్తితో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావలిని ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికల విధులలో ఎలాంటి అలసత్వం లేకుండా క్రమశిక్షణతో తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ అనంతరం జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్ యాక్ట్ ఆంక్షలు అమల్లో ఉన్నందున నిబంధన కచ్చితంగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

**- 24వ డివిజన్ కార్పోరేటర్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి**

**- 60 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేసిన కార్పొరేటర్ కమర్తపు మురళి**





**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహిళలు ఆర్థికాభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని 24వ డివిజన్ కార్పోరేటర్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి అన్నారు. మంగళవారం 24వ డివిజన్ లోని సెయింట్ మేరీస్ స్కూల్ నందు 'జన శిక్షణ సంస్తాన్ స్వయం ఉపాధి శిక్షణ' కేంద్రంలో 56మంది మహిళాలు 60 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి 24వ డివిజన్ కార్పోరేటర్ కమర్తపు మురళి చేతుల మీదుగా కుట్టు మిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కమర్తపు మురళి మాట్లాడుతూ.. కుట్టు మిషన్ ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధిచెంది కుటుంబ ఆసరాకు తోడ్పాటును అందించాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్తాన్ డైరెక్టర్ రాధ కృష్ణ, ట్రైనింగ్ టిచర్ శాంతి, బ్యూటీషియన్ స్రవంతి, డివిజన్ నాయకులు గంగిశెట్టి శ్రీనివాస్, షేక్ గౌస్, సురపానేని సురేష్, పొలురి నాగార్జున, మరికంటి రామకృష్ణ, మహిళ నాయకురాలు రేఖ భార్గవి, మరికంటి అనూష, యలమద్ది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# భర్త మృతి చెందడంతో బీమా చెక్కు అందజేత




**పరకాల , డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పరకాల పట్టణానికి చెందిన కొలుగూరి సరోజన భర్త కొలుగూరి రాజేశ్వరరావు చిరు వ్యాపారం నిర్వహించుకునేం దుకు సుమారు ఆరు నెలల క్రితం బంధన్ బ్యాంక్ పరకాల బ్రాంచ్‌లో రూ.50 వేల రుణం తీసుకున్నారు. రుణం తీసుకునే సమయంలో ఆయన బీమా సౌకర్యం పొందగా, రూ.లక్ష బీమా చేయించారు. అయితే రెండు నెలల క్రితం రాజేశ్వరరావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో బీమా నిబంధనల ప్రకారం బంధన్ బ్యాంక్ ద్వారా రూ.లక్ష బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును సోమవారం కొలుగూరి సరోజనకు అందజేశారు. పరకాల బ్రాంచ్ మేనేజర్ బానోతు నరేష్, ఏరియా మేనేజర్ బాధవత్ శ్రీను, ఏజెంట్ మాలోతు అనిల్ పాల్గొన్నారు. బీమా సౌకర్యం ద్వారా కుటుంబా నికి ఆర్థిక భరోసా లభించిందని బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు.

# పరకాల ఎక్సయిస్ స్టేషన్‌లో వాహనాల వేలం

**పరకాల, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు సంబంధించి వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ వేలం తేది 18-12-2025 (గురువారం) రోజున ఉదయం 11.00 గంటలకు పరకాల ఎక్సైజ్ స్టేషన్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు సంబంధిత వాహనానికి నిర్ణయించిన అప్‌సెట్ ధరలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గలవారు నిర్ణీత సమయానికి హాజరై వేలంలో పాల్గొనాలని ఎక్సైజ్ అధికారులు కోరారు.

# జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు




**హన్మకొండ, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాజీపేట లో నిర్మాణం జరుగుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ లో భూములు కోల్పోయిన అయోధ్య పురం గ్రామ భూ నిర్వాసితుల కోసం ఈనెల తేది 21-12-2025 ఆదివారం రోజు ఉదయం 10 గంటలకు అయోధ్య పురంలో హనుమకొండ జిల్లా సి పి యం మరియు సి పి ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా సంఘాలతో తెలంగాణ రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా మంగళవారం హనుమకొండ జిల్లా సి పి యం నాయకులను హన్మకొండ జిల్లా కార్యాలయంలో కలిసి రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు యం. చుక్కయ్య, బోట్ల చక్రపాణి, రగుల రమేష్, టి. ఉప్పలయ్య, భాను నాయక్, జి. ప్రభాకర్ రెడ్డి, ఐధ్వ జిల్లా కార్యదర్శి ఎల్ దీప తోపాటు సి పి ఐ జిల్లా కార్యాలయం లో వి సి కె పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా,, జీలుకర శ్రీనివాస్, జాతీయ ఓ బి సి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, టి జె యస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు చిల్లా రాజేందర్ ప్రసాద్, హన్మకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష - కార్యదర్శులు పులి సత్యం, కొత్త రవి లను ఇతర ప్రజా సంఘాల నాయకులను కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, అయోధ్య పురం గ్రామ మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, గ్రామ ప్రజలు ఇలా సాగరం ప్రదీప్ కుమార్, ఉప్పు వెంకటేష్, దుప్పెల్లి తేజ, సజనపు రవి కిరణ్, కంగుల రాజేందర్, తదితరులు ఉన్నారు.

# అంతర విశ్వవిద్యాలయం హ్యాండ్ బాల్ పోటీలకు కేఎల్ఎం విద్యార్థిని ఎంపిక

**కడప డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**
కడప నగర పరిధిలోని ప్రముఖ కేఎస్ఆర్ఎం విద్యాసంస్థలలో చదువుతున్న కే ఎల్ ఎం విద్యార్థిని పి. విహిత ఇటీవల జే ఎన్ టీ యు,అనంతపురం పరిధిలోని కళాశాలల హ్యాండ్ బాల్ పోటీల ఎంపికలో పాల్గొని విశేష ప్రతిభ కనపరచి జే ఎన్ టీ యు ,అనంతపురం యూని వర్సిటీ టీంలో చోటు దక్కించు కుంది. మార్చి 2026లో కేరళలో ని కొట్టాయం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో జరగబోవు అంతర విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొంటారు. కళాశాల కరెస్పాండెంట్ రాజేశ్వరి , మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే చంద్ర ఓబుల్ రెడ్డి , ప్రిన్సిపాల్ రత్నమ్మ విహిత ను ప్రత్యేకంగా అభినందించారు.

# కార్మికుల భవనం కబ్జా చేసి కార్మికుల హక్కులు కాలరాస్తున్నారు

- 70 కోట్లు ఖర్చుపెట్టి గెలిచి తిరిగి సంపాదించేందుకే కబ్జాలకు మద్దతు
- వైఖరి ఏంటో తెలుపకపోతే రాష్ట్రంలో ఎక్కడ కార్మికులు తిరగనివ్వరు
- వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**హన్మకొండ,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్థానిక ఎమ్మెల్యే అయినా మంత్రి భర్త గత ఎన్నికల్లో 70 కోట్లు ఖర్చుపెట్టి గెలిచామని చెప్పుకుంటున్నారు ఆ డబ్బును తిరిగి పొందేందుకే అక్రమ కబ్జాలకు మద్దతు ఇస్తున్నారా అని వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రశ్నించారు. కార్మికుల భవనం కబ్జా అయిందని ఆరోపిస్తూ మంగళవారం అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ కార్మికుల హక్కులపై, భవనం కబ్జాపై కొండ వైఖరి తెలపాలని లేకపోతే రాష్ట్రంలో ఎక్కడ కూడా కార్మికులు తిరగనివ్వరని అన్నారు. మాట ఇచ్చి తప్పారు మాట నిలబెట్టుకోవడం చేతకాకపోతే వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో మంత్రి ఇంటి ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్మికుల జోలికి వస్తే గత పాలకులకు పట్టిన గతే పడుతుంది అన్నారు.

# అవినీతిపరులను వదిలేది లేదు..

- కల్పలత సూపర్ బజార్లో భారీగా అవినీతి
- బినామీ పేర్లతో జీతాలు, సొంత వాహనాలకు డీజిల్
- వెంటనే కమిటీ రద్దు చేసే విచారణ చేపట్టాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**హన్మకొండ,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ది కో ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ కల్పలత సూపర్ బజార్ లో భారీగా అవినీతి జరిగిందని అవినీతి పరులను వదిలేది లేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కల్పలత సూపర్ బజార్ ను ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బినామీల పేర్లతో జీతాలు, సొంత వాహనాలు డీజిల్, సభ్యత్వ నమోదులో అవకతవకలు పట్ల ఎమ్మెల్యే మండిపడ్డారు. వెంటనే కమిటీని రద్దుచేసి సంబంధిత పత్రాలను పరిశీలించి సీజ్ చేసి విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా రోజులుగా కల్పలత సూపర్ బజార్ లో అవకతవకలు జరిగాయని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి రంగంలో అవినీతి జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇక్కడ జరిగిన కుంభకోణం పై వెంటనే విచారణ చేపట్టాలని సంబధిత అధికారులకు కోరడం జరిగిందని అన్నారు. సొసైటీలో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని, తప్పు చేసిన వారిని వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

# అప్పుల భారంతో వ్యక్తి ఆత్మహత్య





**మల్లంపల్లి మండల ప్రతినిధి డిసెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా, మల్లంపల్లి మండలం, శ్రీనగర్ గ్రామానికి చెందిన మేకల విజయ్ (35) అప్పుల భారాన్ని భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే మృతుడు మేకల విజయ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అయితే గత కొంతకాలంగా సరైన పని దొరకకపోవడంతో సుమారు రూ. 5 లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల భారంతో తీవ్ర మానసిక వేదనకు గురైన విజయ్, "నేను చనిపోతేనే నాకు మనశ్శాంతి ఉంటుంది" అని అప్పుడప్పుడు కుటుంబ సభ్యులతో చెప్పేవాడని ఫిర్యాదుదారు మేకల రాజేశం (60) తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. విజయ్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె వయసు 14 సంవత్సరాలు, రెండో కుమార్తె 10 సంవత్సరాలు, కుమారుడు 6 సంవత్సరాలు ఉన్నారు. డిసెంబర్ 16న మధ్యాహ్నం సుమారు 12:40 గంటల సమయంలో విజయ్ తల్లి ఇంటికి వచ్చేసరికి, ఇంటి హాల్‌లో ప్యాన్‌కు చీరతో ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఇది పూర్తిగా వ్యక్తిగత కారణాలతో జరిగిన ఆత్మహత్యగా పేర్కొంటూ ఎటువంటి అనుమానాలు లేవని తెలిపారు. ఈ మేరకు ములుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఏది నిజం- ఎటు పోతుంది కలం?

ఇది ఇప్పుడు జరుగుతున్న వాస్తవం?. ఏది నిజం- ఎటు పోతుంది కలం?. ఇది కవిత కాదు, ఇప్పుడు నడుస్తున్న సత్యం?. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సిన కలం. ఎక్కడ చేస్తున్నాయి ప్రజలకు న్యాయం?. వాసన వచ్చిందంటే సువాసనతో పనిలేదు, పీక్కొని తినేందుకు పరిగెత్తాలి బలవంతుడా, బలహీనతుడా అవసరం లేదు?. ఏది నిజం ఎటు పోతుంది కలం?. ఆస్పత్రిలో అబార్షన్ అయ్యిందా పీక్కొని తినాలి వైద్యుల్ని?. బాధితురాలకు జరిగే న్యాయం పక్కనపెట్టి ఎవరికోసం పరుగులు జేబులు నింపుకునేందుకు బాధితురాలుకు న్యాయం చేసేందుకా?. ఎటు పోతుంది ఈ కలం?. ఆకలితో అలమటిస్తున్న విద్యార్థుల బాధలను చూడండి, ఎవరికీ చెప్పుకోలేని పసి మొగ్గల బాధలను గమనించండి?. జిల్లా పాలనాధికారి వరకు వారి బాధలను తీసుకెళ్ళేది ఎవరు?. పురుగుల అన్నం, నీళ్ల చారు తినలేని అభాగ్యులేందరో?. నిజాన్ని బయటకి తీయకుండా రాబందుల్లా పీక్కొని తింటున్నారు?. ఎటు పోతుంది ఈ కలం. పోటీ చేసే అభ్యర్థి పైసలు పంచితే రాస్తుంది కలం అదే వ్యక్తి జేబులు నింపితే అసలు నిజం దాస్తుంది కలం?. ఎక్కడుంది న్యాయం, ఎటు పోతుంది ఈ కలం?.రోడ్డు దాటేందుకు అవస్థలు పడుతున్న వృద్ధులు ఎందరో రక్షకభటులు ఏం చేస్తున్నారని ప్రశ్నించే వారు తప్ప, కలాన్ని కాసేపు పక్కన పెట్టి కాపాడుదామని ఆలోచన రాదు ఎందుకు?.ఇక్కడ జేబులు నింపేందుకు ఎవరు లేరనే కదా?. ఎక్కడుంది న్యాయం,ఎటు పోతుంది కలం. ఆర్టీసీ బస్టాండ్లో మహారాజుల చేస్తున్నారు దొంగలు దొంగతనాలను, రక్షక బటులు ఎక్కడా అని ప్రశ్నిస్తున్నారు, మీరు చేసే పని ఏమిటని నిలదీస్తున్నారు ఆర్టీసీ అధికారులను, ఫ్యాన్ తిరగకపోతే రాస్తారు, వాష్ రూమ్ ల వద్ద పది రూపాయలు వసూలు చేస్తే అధికారులను నిలదీస్తారు, జేబులు నింపితే నిమ్మ కుంటారు, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎప్పుడూ బయటికి తీస్తారు?. చెట్టు దొరికితే 10 మంది పేరు చెప్పుకొని పరుగు తీస్తారు, ఫలాలు దొరకగానే జేబులో పెట్టుకొని పరారవుతారు?. ఎక్కడుంది న్యాయం, ఎటు పోతుంది కలం. ప్రజల్లో పరువు పోతున్న పట్టించుకోరు వీరి కన్నా గుడి ముందు అడుక్కునే వారే నయం అంటున్నారు పరిశీలకులు?. ఎక్కడుంది న్యాయం, ఎటు పోతుంది కలం?.



పిసిడబ్ల్యూ న్యూస్
జర్నలిస్ట్ తిరునహరి
మనోహర స్వామి

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సమన్వయం పాటించాలి

- క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్





**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతిఒక్కరు సమన్వయం పాటించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి మండలంలోని పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. మంగళవారం కారేపల్లిలో పోలింగ్ కేంద్రంలో బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రతిఒక్కరు సమన్వయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, శాంతియుత ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, స్థానిక ప్రజలకు,రాజకీయ నాయకులు సహకారం అందించాలన్నారు. సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతిలేదని, నిబంధన అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

# భిన్న సంస్కృతుల మధ్య ప్రపంచ ఐక్యత స్నేహాన్ని పెంపొందించడం ఇస్కఫ్ లక్ష్యం

**తక్కలపల్లి శ్రీనివాసరావు రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి**



**హన్మకొండ,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో భిన్న సంస్కృతులు అనేక భాషలు ఆచార అలవాట్లు కలిగిన విభిన్న ప్రజల ఐక్యత కొరకు భారతదేశం తో స్నేహ సంబంధాలు కలిగి ఉండే ప్రపంచ దేశాల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించి ఒకరి సంస్కృతి పట్ల విశ్వాసాల పట్ల సానుకూల వైఖరి కలిగి ఉంటూ స్నేహ భావంతో విశ్వ మానవ కళ్యాణం కొరకు ఇండియన్ కల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ ఇస్కఫ్ పని చేస్తుందని తక్కలపల్లి శ్రీనివాసరావు భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తెలిపారు. మంగళవారం హనుమకొండ లో ఇష్క్ సభ్యత్వ చేర్పింపు కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చిరునవ్వు, పలకరింపు, స్నేహభావము ఆధునిక యుగములో కొర బడుతుందని పేర్కొన్నారు ఇస్కఫ్ ఆర్గనైజేషన్ ద్వారా దేశాల మధ్య సాంస్కృతు ల మధ్య భిన్న భాషలు మతాల మధ్య సామరస్యాన్ని స్నేహాన్ని పెంపొందింప చేయాలని పిలుపు నిచ్చారు డిసెంబర్ 19న హనుమకొండ జిల్లా ఇస్కఫ్ మహాసభ ను జనవరి 18 న హైదరాబాదు లో జరుగు ఇస్కఫ్ రాష్ట్ర మహాసభను 2026 జనవరి 30, 31న చెన్నైలో జరుగు ఇండియన్ కల్చరల్ కో..ఆపరేటివ్ సొసైటీ మహాసభలలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో నేదునూరి రాజమౌళి ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దొమ్మటి ప్రవీణ్ కుమార్ ఇస్కఫ్ సమన్వయ కార్యదర్శి ఎర్ర నాగరాజు నవ చైతన్య బుక్ హౌస్ మేనేజర్ ఉస్మాన్ పాషా సూర్యం వెంకటేశ్వర్లు నగరబోయిన కావేరి తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులను

# పరామర్శించిన ఎమ్మెల్యే

- రోగులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్







**సత్తుపల్లి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన భూక్య వెంకటేశ్వరరావు సతీమణి భూక్య మంగమ్మకు ఇటీవల గుండె శస్త్రచికిత్స జరగగా, ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్సపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామానికి చెందిన దాసరి చెన్నారావు కుమారుడు దాసరి శ్రీనివాసరావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా ఆయనను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. రోగులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

# ఖమ్మాన్ని కాంగ్రెస్ కంచుకోటగా తీర్చిదిద్దడమే లక్ష్యం




**60 డివిజన్లలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలి**

**"గడపగడపకు కాంగ్రెస్ పార్టీ" నినాదంతో నగరవ్యాప్త పర్యటన**

**నూతన నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరికి బ్రహ్మరథం**

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగరాన్ని కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మార్చాలన్న సంకల్పంతో నూతనంగా నియమితులైన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి నగరవ్యాప్తంగా విస్తృత పర్యటన చేపట్టారు. "గడపగడపకు కాంగ్రెస్ పార్టీ" అనే నినాదంతో సాగుతున్న ఈ పర్యటనకు అన్ని డివిజన్లలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గత నెల రోజులుగా కరుడుకట్టిన కాంగ్రెస్ వాదిగా, సేవాభావంతో పనిచేస్తున్న దీపక్ చౌదరి నగరంలోని ప్రతి డివిజన్‌లో కార్యకర్తలను, నాయకులను ప్రత్యక్షంగా కలుసుకుంటూ వారి సమస్యలు, ఆశయాలను తెలుసుకుంటున్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరంగా సాగుతున్న ఈ పర్యటనలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎదురొచ్చి ఘన స్వాగతాలు పలుకుతూ బ్రహ్మరథం పడుతున్నారు. 52వ డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖలీల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి ఫజల్ తదితరుల ఆధ్వర్యంలో దీపక్ చౌదరికి ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులు, యువనేత తుమ్మల యుగంధర్ బాబు సూచనలతో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దీపక్ చౌదరి మాట్లాడుతూ, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొంటూ, వారి సమస్యల పరిష్కారానికి తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తల సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యువనేత యుగంధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయిస్తామని భరోసా ఇచ్చారు. యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఖలీల్, ఎండి ఫజల్, నరాల నరేష్, మోహన్ నాయుడు, సంగయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ సిటీ మాజీ చైర్మన్ డి. వెంకట్రావు నాయక్, ఖలీల్, అల్లాద్దీన్, బాజీ, విజయ్, గణేష్, అసిఫ్, ఉదయ్ శ్రవణ్, ఇస్మాయిల్, నితిన్‌తో పాటు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తగా మంచి పేరు సంపాదించుకున్న రాజేష్ నాయక్

**దర్గా-ఇన్ముల్ నర్వ గ్రామ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న నాయకుడు**

**లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కూడా సేవలు అందిస్తున్నారు**

**ఇలాంటి కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానంతో గౌరవించాలి**

**స్థానిక జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల స్థానం కల్పించాలంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్న రాజేష్ నాయక్**




**షాద్ నగర్,డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సామాన్య కార్యకర్త జీవితం అంటే నిబద్ధతతో, పార్టీ కోసం, సామాన్యుల సమస్యల పరిష్కారం కోసం కష్టపడే నిరంతర పోరాటంబీ ఇది ఆర్థిక ఇబ్బందులు జీవన పోరాటం చేస్తూ అలాగే పార్టీలో తమకు గుర్తింపు లభించాలనే ఆకాంక్షలతో నిండి ఉంటుంది అలాంటి వారిలో తెలంగాణ రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రాజేష్ నాయక్ ఒకరు 1995లో కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ జీవితం మొదలుపెట్టి పలువురు రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గ నాయకులతో కలిసి పని చేసిన అనుభవం అతనిది అప్పటి ఎమ్మెల్యే శంకర్రావు తో కలిసి అనేక పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నాడు. మలిదశ తెలంగాణ ఉద్యమం తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో తెలంగాణ జెండా పది సంవత్సరాలు భుజానికి వేసుకొని క్రియాశీలక పాత్ర పోషించినప్పటికీ అక్కడ ఎలాంటి గుర్తింపు లేకపోవడంతో మళ్లీ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నేతగా పనిచేస్తూ నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తగా మంచి పేరు సంపాదించుకున్నారు అలాగే దర్గా - ఇన్ముల్ నర్వ గ్రామ సమస్యలపై అరుపెరుగని పోరాటం చేస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ను సంపాదించుకున్నారు.రాజేష్ సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా మంచి పదవి తో సముచిత స్థానం కల్పించింది. కాంగ్రెస్ పార్టీలొ ఒక మంచి కార్యకర్తగా గుర్తింపు ఉన్నప్పటికీ రాజకీయ పదవుల్లో మాత్రం న్యాయం జరగలేదని చెప్పాలి. పదేండ్లు నిరాశలో ఉన్న కాంగ్రెస్ పార్టీకిఇటు వీర్లపల్లి శంకర్ అటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలమైన పునాదులు వేసుకుందని షాద్నగర్ నియోజకవర్గం లో వీర్లపల్లి శంకర్ కు తిరుగులేదని కష్టాల్లో ఉన్న కార్యకర్తను చూసి ఆదుకునే వ్యక్తి మా ఎమ్మెల్యే శంకర్ అన్న అని కొనియాడారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచులను అధిక మెజార్టీతో గెలిపించి తన సత్తా చాటుకున్నాడని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న 6 గ్యారంటీలు ప్రజల్లో మంచి ఆదరణను చూరగోన్నాయని. తద్వారా కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని అన్నారు. రేపు రాబోయే స్థానిక ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో ఎంతోకాలంగా పని చేస్తున్న మా లాంటి కార్యకర్తను గుర్తించి ఆయా పదవులలో సముచిత న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు.

# మానుకోట లోనే రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలి

**• అఖిలపక్ష కమిటీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**




**మహబూబాబాద్ డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** మానుకోట లోనే రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపోను ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో అఖిలపక్ష కమిటీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ర్యాలీ ముఖ్యాంశాలు రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపోను మానుకోట నుండి వేరే జిల్లాకు తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ నాయకులు నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మానుకోటలో ఏర్పాటు చేయాల్సిన డిపోను వేరే జిల్లాకు తరలించే ప్రయత్నం చేస్తే, తమ నిరసనలో భాగంగా "మానుకోట రాళ్లకు పని చెప్పాల్సి వస్తుంది" అంటూ ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. ఈ డిమాండ్ సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థి సంఘాలచే విద్యార్థుల మానవ హారం ఉద్యమ స్ఫూర్తితో నిర్వహణమహబూబాబాద్ కు రైల్వే మెగా మెయిన్ టేనేన్స్ డిపో సాధనకు స్థానిక కుమరంభీమ్ విగ్రహం నుండి విద్యార్థు ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ లో మానవహారం నిర్వహించారు. విద్యార్థి, డిపో సాధన కమిటీ బాధ్యులు మాట్లాడారు. దక్షిణమధ్య రైల్వే జోన్ పరిధిలోని మహబూబాబాద్ లో 908.15 కోట్ల తో మెగా మెయిన్టెనెన్స్ డిపో ఏర్పాటు చేయుటకు అక్టోబర్ లోనే ఉత్తర్వులు విడుదల చేయడం జరిగినది. ఈ డిపో లో పీరియాడికల్ ఓవర్హాలింగ్, రెగ్యులర్ ఓవర్హాలింగ్, సిక్ లైన్, ట్రైన్ ఎగ్జామినేషన్ వంటి సదుపాయాలు ఉంటాయి. దీనివలన ఈ ప్రాంతం లో పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. కావున ఈ మెగా డిపో ను వదులు కోవడానికి ఇక్కడి ప్రజలు సిద్ధంగా లేరని, రైల్వే అధికారులు తమ నివేదికలో మానుకోట డిపో ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా గుర్తించాలి. ఇప్పటికే ఈ డిపో సాధనకు స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం అనుకూలంగానే ఉంది. రాజకీయంగా ఇక్కడినుండి తరలించే ప్రయత్నాన్ని ఉద్యమ స్ఫూర్తితో అన్నీ రాజకీయ, కుల, ప్రజా, విద్యార్థి, ఇతర సంఘాలు అడ్డుకునే విదంగా ఒకే గొంతుకతో పోరాడుదామని వక్తలు తెలిపారు. ఈ ర్యాలీలో ఈ కార్యక్రమం లో విద్యార్థి సంఘాలు DSFI,SFI, PDSU, VJS, రాజకీయ పార్టీ లు, కాంగ్రెస్, బి ఆర్ ఎస్, సిపిఐ ఎం ల్ న్యూ డెమోక్రసీ,TDP, TP JACLHPS, వడ్డెర సంఘం, రజక సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, ప్రైవేట్ అధ్యాపకుల సంఘం ,తెలంగాణ కళాకారుల సంఘం,మేరు సంఘాల బాధ్యులు సాధన సమితి బాధ్యులు డోలీ సత్యనారాయణ, మైసా శ్రీనివాస్,కెలోత్ సాయికుమార్ ,గుగులోతు సూర్య ప్రకాష్,పట్ల మధు,బోనగిరి మధు, నాగరాజు, ఇరుగు మనోజ్, కేలోత్ సాయి, గుగులోత్ సూర్య ప్రకాష్, ఖలీల్, ఫరీద్, గౌని ఐలయ్య, మండల వెంకన్న, ప్రేంచంద్ వ్యాస్,గుగులోత్ బీమానాయక్, నిమ్మల శ్రీను,బోడ రమేష్, . కృష్ణప్రసాద్,కుమ్మరికుంట్ల నాగన్న, సంపంగి రాంచంద్రు, షేక్ జానీ, సోమా విష్ణు వర్ధన్,దుగ్గి గోపాల్, అడపా మల్లికార్జున్, దుగ్గి లింగమూర్తి, కుర్ర మహేష్, ఖాజా పాషా,ప్రసాద్ రమేష్, కంబాలపల్లి సత్యనారాయణ,హాలవత్ లింగ్య, సామ పాపయ్య తదితరులతో పాటుగా వందలాది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 17 వరకు గ్రామాల్లో 144 సెక్షన్ అమ్ములు ఉంటుంది

**దంతాలపల్లి డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈనెల 17 వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని డిఎస్పి కృష్ణ కిషోర్ అన్నారు మంగళవారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని దాట్ల పెద్ద ముప్పారం తదితర గ్రామాలలో పర్యటించారు ఇటీవల్ల సర్పంచులుగా గెలిచిన అభ్యర్థులు శాంతియుత వాతావరణంలో గ్రామాలను ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎదుటి వ్యక్తులను రెచ్చగొట్టే ప్రసంగాలను చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ పిల్లల రాజు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

**దంతాలపల్లి డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నెలకొల్నా సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీ ఓ మహమ్మద్ అప్సర పాషా అన్నారు మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రత్యేకత కృతజ్ఞతలు తెలిపారు పంచాయతీలలో నల్గొండ సమస్యలను అప్రమత్తంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సిరబోయిన శ్రీనివాస్ దేశ బోయిన వెంకన్న అజయ్ మధు శ్రీధర్ నాగార్జున సృజన హరి మధు మమతా శ్రీ తదితరులు పాల్గొన్నారు

## వార్డు మెంబర్ శాంతి శేఖర్ కృతజ్ఞతలు



**రామన్నపేట డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం వెల్లంకిలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి సమక్షంలో బీజేప బలపరిచిన బీఆర్ఎస్ అభ్యర్థి జినుక శాంతి శేఖర్ గెలుపొందారు. ఆరో వార్డులో 10 ఓట్ల మెజారిటీతో ఆమె విజయం సాధించారు. తన గెలుపు కోసం కృషి చేసిన మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, వార్డు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈమె గత ఎన్నికల్లోను వార్డు మెంబర్ గా గెలిచారు.

## గరిక సత్యనారాయణను సన్మానించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేజర్ గ్రామపంచాయతీగా కాంగ్రెస్ సర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం శాలువా కప్పి పూలమాలవేసి సన్మానించినారు వారితోపాటు వాడు సభ్యులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ నాయకులు జింగల ప్రభాకర్ సాల్వేర్ అశోక్ మొహమ్మద్ నాసర్ వనం చంద్రశేఖర్ జిల్లా వెంకటేశం బొడ్డు సురేందర్ రావు గోదాస్ శ్రీమన్నారాయణ మొహమ్మద్ అక్రం బుర్రి రవీందర్ కోట సుధాకర్ రాపోలు ఉపేందర్ గంగాపురం శంకర్ పల్లపురవి మొహమ్మద్ అజార్ కక్కినేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## పార్టీ నుంచి బహిష్కరణ


**రామన్నపేట డిసెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**

రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామానికి చెందిన తాటిపాముల శేఖర్ గౌడ్ ని కాంగ్రెస్ పార్టీ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేయడం జరిగింది. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎలక్షన్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గంజి భార్గవి భాస్కర్ గారికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తాటిపాముల శేఖర్ గౌడ్ ని,ఈరోజు కాంగ్రెస్ పార్టీ వెల్లంకి గ్రామశాఖ శాశ్వతంగా సస్పెండ్ చేయడం జరిగింది. ఇంకా చాలా మంది పార్టీ వ్యక్తులు పార్టీకి ద్రోహం చేసి వెన్నుపోటు పొడిచారు. వారిపైన కూడా త్వరలోనే చర్యలు తీసుకుంటాము అని తెలియజేస్తూ... ఇట్లు,అయిటిపాముల పెద్దులు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, వెల్లంకి గ్రామం.



## రౌడీ జనార్ధన్‌గా వస్తోన్న విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవికిరణ్ కోల దర్శకత్వంలో 'రౌడీ జనార్దన్' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కీర్తి సురేశ్ కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈనెల 18న దిల్‌రాజు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించి విజయ్ డబ్బింగ్ పూర్తి చేసినట్లు తెలిసింది. ఇది కోనసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. దీంట్లో ఓ అందమైన ప్రేమకథ మిళితమై ఉంటుంది. విజయ్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో అలరించనున్నారు.



## నా పెళ్లిపై అసత్య ప్రచారలెందుకు

**- నటి మెహరీన్ ఘాటు వ్యాఖ్యలు**

తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరిన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు. కెరీర్‌లో గ్యాప్‌పై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. గ్యాప్ కావాలని తీసుకోలేదని, 'ఎఫ్ 3' తర్వాత చేసిన 'సుల్తాన్ ఆఫ్ దిల్లీ' వెబ్‌సిరీస్ కోసం ఎక్కువ సమయం కేటాయించానని తెలిపారు.



## శిల్పాశెట్టి బాస్టియన్ రెస్టారెంట్‌పై కేసు

బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరులో మరో వివాదంలో చిక్కుకుంది. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. సెయింట్ మార్క్స్ రోడ్‌లో ఉన్న 'బాస్టియన్' రెస్టారెంట్ డిసెంబర్ 11న రాత్రి 1.30 గంటల వరకు కార్యకలాపాలు కొనసాగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇది పోలీసులు ఇచ్చిన సమయానికంటే ఎక్కువసేపు నిర్వహించినట్లు సమాచారం. దీంతో కర్ణాటక పోలీస్ చట్టంలోని సెక్షన్ 103 కింద సుమోటో ఫిర్యాదుల ఆధారంగా కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు మేనేజర్‌లు, ఇతర సిబ్బందిపై కేసులు నమోదు అయ్యాయి. 'బాస్టియన్'తో పాటు, రెసిడెన్సీ రోడ్‌లో ఉన్న 'సౌర్ బెర్రీ పబ్' పై కూడా కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా పబ్ సిబ్బందితో సహా ఎనిమిది మంది వాంగ్మూలాలను పోలీసులు రికార్డు చేశారు.



## అమెజాన్‌లోకి రష్మిక థామా మూవీ

మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన హార్రర్ మూవీస్‌కు సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఇదే జోనర్‌లో రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా కాంబోలో దీపావళి సీజన్‌లో ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ చిత్రం థామా . మ్యాడ్‌డాక్ హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వచ్చిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. తెలుగులో కూడా డబ్బింగ్ అయిన ఈ చిత్రానికి యావరేజ్ టాక్ వచ్చింది. ఆ తర్వాత థామా పాపులర్ ఓటీటీ ఎ÷–లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోలో ఇటీవలే రెంటల్ బేసిస్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రాన్ని ఇక ఉచితంగా చూసేయొచ్చు. థామా అమెజాన్ సబ్ స్క్రైబర్లకు ఉచితంగా అందుబాటులో ఉంది. హిందీ, తెలుగు ఆడియోతోపాటు ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ తో వీక్షించవచ్చు. ఆదిత్య సర్పోట్‌దర్ డైరెక్టర్ చేసిన ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్దిఖీ, పరేశ్ రావల్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. సచిన్–జిగర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. మలైకా అరోరా, నోరా ఫతేహి, వరుణ్ ధవన్ కామియో రోల్స్‌లో నటించారు.



## శివ రాజ్‌కుమార్, ఉపేంద్రల మల్టీస్టారర్ చిత్రం '45'.

కన్నడ అగ్ర నటులు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం '45'. ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ఉపేంద్రతో పాటు రాజ్ బి. శెట్టి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. సినిమా విభిన్నమైన కథాంశంతో, ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ కు అధిక ప్రాధాన్యం ఇస్తూ రూపొందినట్టు స్పష్టమవుతోంది. ఉపేంద్ర తన గత చిత్రాల మాదిరిగానే ఇందులోనూ ఒక డిఫరెంట్, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం 25న క్రిస్మస్ కానుకగా విడుదల కానుండగా తెలుగు ప్రేక్షకుల కోసం ఈ చిత్రాన్ని వారం ఆలస్యంగా, జనవరి 1న కొత్త సంవత్సరం కానుకగా విడుదల చేయనున్నారు.